# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో 8 మంది మృతి చెందగా పలువురు గాయపడ్డారు.**

2. **విశాఖ ఉక్కు కర్మాగార ప్రమాదంలో సిబ్బంది మృతి పట్ల ప్రధానమంత్రి, ముఖ్యమంత్రితో పాటు పలువురు విచారం వ్యక్తం చేశారు.**

3. **సైబరాబాద్‌లో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

4. **గోదావరిలోకి చేరే మురుగునీటిని శుభ్రం చేసేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం ఉక్కు కర్మాగారంలో నిన్న జరిగిన ప్రమాదంలో 8 మంది మృతి చెందగా పలువురు గాయపడ్డారు. కర్మాగారంలోని స్టీల్ మెల్టింగ్ షాప్-1 పరిధిలోని ల్యాడిల్ నుంచి హాట్‌మెటల్ బకెట్లు అకస్మాత్తుగా కిందపడిన కారణంగా భారీ మొత్తంలో ద్రవలోహం పైకి రావడంతో ప్రమాదం చోటు చేసుకుందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. విశాఖ ఉక్కు కర్మాగార ప్రమాదం ఉద్యోగులు మృతి చెందడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుతో కలిసి నిన్న పరిశీలించారు. అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ, ప్రమాదంలో మృతి చెందిన ప్రతి ఉద్యోగి కుటుంబానికి 25 లక్షల రూపాయల చొప్పున పరిహారాన్ని ఇస్తున్నట్లు తెలియజేస్తూ...

వాయిస్ ..30..సెకన్లు

--------------------------

విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న సమీక్ష నిర్వహించారు. ప్రమాద ఘటన వివరాలు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలు, ప్రస్తుత పరిస్థితిని జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని

ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

---------------------------

ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాద ఘటన స్థలాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ తో కలిసి నిన్న పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన కార్మికులకు అందిస్తున్న వైద్య సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ ..25..సెకన్లు

ప్రమాద ఘటన నేపథ్యంలో విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. క్షతగాత్రులకు సంబంధించిన వివరాల కోసం 0891–2590100, మరో నెంబర్ 0891–2590102 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

---------------------------

సైబరాబాద్‌లో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మియాపూర్‌లోని సైబరాబాద్ నగర పాలక సంస్థ–సీఎంసీ నూతన కార్యాలయం సహా పలు అభివృద్ధి పనులకు దృశ్యమాధ్యమ విధానంలో ఆయన నిన్న శంకుస్థాపనలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికే నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించామని అన్నారు. సైబరాబాద్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలతో నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

గోదావరిలోకి చేరే మురుగునీటిని శుభ్రం చేసేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. గోదావరి నీటి నమూనాలపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అందించిన నివేదికపై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ గోదావరి నదిలో పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీటి కారణంగా కాలుష్యం ఆందోళనకర స్థాయికి చేరిందని తెలిపారు. అనుమతించదగిన పరిమితుల కంటే కాలుష్య కారకాలు అధికంగా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. గోదావరి నది కలుషితమవుతున్నా నిర్లక్ష్యం వహించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

రైతులకు నాణ్యమైన ఎరువులను సకాలంలో అందించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం జంబులదిన్నెలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎరువుల పంపిణీ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన ద్వారా జిల్లా వ్యవసాయ రంగానికి గణనీయమైన ప్రయోజనం కలుగుతోందని తెలిపారు.యూరియా, డీఏపీ ఎరువులపై కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

---------------------------

బీహార్‌లో జరిగిన ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ లోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన వారు మృతి చెందడం పట్ల దేవాదాయా శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. నెల్లూరులో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన బాధితులను సురక్షితంగా స్వస్థలాలకు తరలించేందుకు ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

తెలంగాణలో ఇటీవల వెలుగుచూసిన రెండు ఎబోలా అనుమానిత కేసుల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో ఆయన నిన్న ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎబోలా వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎబోలా నిర్ధారణకు అవసరమైన పరీక్షా కిట్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

---------------------------

"వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిన్న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతంలోని పలు నియోజకవర్గాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, టౌన్ హాల్ సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ప్రభుత్వ పాలన, ఎన్నికల హామీలు, ప్రజా సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు మరింత చురుగ్గా విస్తరిస్తున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది, తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకు ద్రోణి కొనసాగుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.

అదేవిధంగా తెలంగాణలో ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఈరోజు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

=====================